



పోలీసు స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎస్పీ

# జిల్లాకు 300 మంది కానిస్టేబుళ్లు

## ఎస్పీ జగదీష్

**ప్రజాశక్తి-రాయదుర్గం**

అనంతపురం జిల్లా పోలీసు శాఖకు కొత్తగా 300 మంది కానిస్టేబుళ్లు, 20 మంది ఎస్ఐలు కేటాయించబడ్డారని ఎస్పీ జగదీష్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా రాయదుర్గం, డి.హిరేహాల్ పోలీస్ స్టేషన్లు, రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా డి.హిరేహాల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని తొలగించాల్సినందున మరోచోట భవనం నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో పరిపాలన వ్యవస్థ, కేసుల నమోదు, దర్యాప్తులో పురోగతి, రికార్డుల నిర్వహణ మొదలైన అంశాలను తెలుసుకున్నారు. స్టేషన్లో నమోదైన పెండింగ్ కేసులు, కోర్టు కేసుల సంబంధిత స్థితిగతులు, ఎఫ్ఐఆర్ కేస్ డైరీ జనరల్ డైరీ, స్టేషన్ హౌస్ రికార్డులు, సీజ్ చేసిన వస్తువుల భద్రత వంటి అంశాలను తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో నమోదు చేసి న్యాయబద్ధంగా విచారణ చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం లభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ప్రజల్లో సైబర్ మోసాలపై సురక్ష డిజిటల్ వాహనం ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా సైబర్ నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, పాత కేసుల పరిష్కారం విషయమై కింది స్థాయి అధికారులకు తగిన సూచనలు చేసామన్నారు. పోలీసు శాఖకు కొత్త సిబ్బంది నియామకంలో భాగంగా అనంతపురం జిల్లాకు 300 మంది కానిస్టేబుళ్లు, 20 మంది ఎస్ఐలు కేటాయించబడినట్లు చెప్పారు. వారు వచ్చేవారం నుంచి శిక్షణలోకి వస్తారన్నారు. ఏడాదిలోపు శిక్షణ పూర్తి చేసి వారిని పోలీస్ స్టేషన్లకు కేటాయిస్తామన్నారు. ఎస్పీ వెంట కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్, రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, ఎస్ఐలు శ్రీరాం ప్రసాద్, నాగమధు, గురుప్రసాద్ రెడ్డి ఉన్నారు.

**శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడం**

**కళ్యాణదుర్గం టౌన్ :** శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడబోమని ఎస్పీ జగదీష్ చెప్పారు. ఆకస్మిక తనఖీలలో భాగంగా మంగళవారం సాయంత్రం కళ్యాణదుర్గం డీఎస్పీ, మండల రూరల్ పోలీస్ స్టేషన్‌లను తనిఖీచేశారు. ఆయా కార్యాలయాలలో ఫిర్యాదులు, కేసుల నమోదు విషయాలను పరిశీలించారు. శాంతిభద్రతలు, అసాంఘిక శక్తులపై తీసుకుంటున్న పోలీసు చర్యలపై ఆరా తీశారు. పోలీసులతో సత్వరన్యాయం అందించడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, సిఐలు నీలకంఠేశ్వర, గణేష్, వివిధ స్టేషన్ల ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



కాలవ శ్రీనివాసులు



ఎంఎస్.రాజు

# టిడిపికి కొత్త అధ్యక్షులు

## అనంతకు కాలవ.. హిందూపురానికి రాజు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

తెలుగుదేశం పార్టీ అధిష్టానం పార్లమెంటరీ నియోజకవర్గం కొత్త అధ్యక్షులు నియామకాలను చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాలకు అధ్యక్షుడి నియామకం జరిగింది. తెలుగుదేశం పార్టీ అనంతపురం పార్లమెంటరీ అధ్యక్షులుగా రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టిడిపి హిందూపురం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులుగా మడకశిర ఎమ్మెల్యే, టిడిపి బోర్డు కమిటీ సభ్యులు ఎంఎస్.రాజులను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులుగా వెంకట శివుడు యాదవ్, హిందూపురం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులుగా వడ్డే అంజినప్పలు పని చేశారు. వీరిద్దరూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియమించబ్డారు. ప్రస్తుతం రెండు జిల్లాల అధ్యక్షులుగా నియమితులైన వారు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కాగా అనంతపురం జిల్లా అధ్యక్షులు పని చేసిన వెంకట శివుడు యాదవ్‌కు కార్మిక సంక్షేమ శాఖ బోర్డ్ చైర్మన్‌గా ప్రభుత్వం నామినేటెడ్ పదవిని కల్పించింది. హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు వడ్డే అంజినప్పకు మాత్రం ఎలాంటి నామినేటెడ్ పదవి ఇంకా ఇవ్వలేదు. రెండు జిల్లాలకు కొత్త అధ్యక్షులుగా నియమితులైన కాలవ శ్రీనివాసులు, ఎంఎస్.రాజులు మూడేసి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేసుకోవడంలో భాగంగా అధ్యక్షుల మార్పునకు టిడిపి అధిష్టానం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కాలవ శ్రీనివాసులు పొలిట్ బ్యూరో సభ్యులుగా, ఉమ్మడి జిల్లాకు మాజీ అధ్యక్షులు పని చేశారు. పార్టీని కష్ట కాలంలోనూ సమర్థవంతంగా నడిపించగలిగారు. అందుకోసమే మరోసారి ఆయనకే అనంతపురం జిల్లా పగ్గాలను అధిష్టానం అప్పగించింది. హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు యువకుడు ఉత్సాహ వంతుడిగా పార్టీలో గుర్తింపు తెచ్చుకున్నారు. అందరిని కలుపుకుని పార్టీని ముందుకు తీసుకెళ్లడంతో ఈయన కృషి చేస్తారన్న నమ్మకంతో అధ్యక్షుడి బాధ్యతను అప్పగించినట్లు తెలుస్తోంది.

# ఉద్యోగోన్నతిపై హైకోర్టు అక్షింతలు

- స్పందించిన ఆర్‌డి
- కార్పొరేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం
- అడ్డుగోలు ఉద్యోగోన్నతిని రద్దు చేయాలంటూ ఆదేశం




**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో ఓ ఉద్యోగి ఉద్యోగోన్నతి అంశం తీవ్ర చర్చనీయంశం అవుతోంది. బాధితుడు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించడంతో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతి కల్పించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణం ఈ ఉద్యోగోన్నతిని రద్దుచేసి సమాచారం పంపాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నాగరాజును ఆదేశించింది. ఉద్యోగోన్నతి అంశంలో బిల్ కలెక్టర్ లక్ష్మీనరసింహమూర్తికి ఇవ్వడాన్ని అతని కంటే సీనియార్టీ జాబితాలో ముందున్న హర్షవర్ధన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులను ఖాతరు చేస్తూ బిల్ కలెక్టర్ హర్షవర్ధన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంపై కొందరు అధికారుల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ను పలు రకాల బెదిరింపులకు గురి చేసినట్లు తెలుస్తోంది. అయినా హర్షవర్ధన్ బెదరక హైకోర్టులో న్యాయం, తన హక్కుల కోసం న్యాయపోరాటం చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపిన కోర్టు పిటిషనర్ సమర్పించిన రికార్డులను పరిశీలించి ఆదేశాలు ఇచ్చారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో బిల్ కలెక్టర్ లక్ష్మీ నరసింహమూర్తికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించటం అక్రమంగా తేల్చింది. కమిషనర్ బాలస్వామి పేరుతో జారీచేసిన ఉద్యోగోన్నతి ఉత్తర్వులను ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే రద్దు చేయాలంటూ ఆదేశించింది. ఉద్యోగోన్నతి పొందిన లక్ష్మీనరసింహమూర్తిని బిల్ కలెక్టర్‌గా రివర్షన్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

**ఆర్డీ ఆగ్రహం**

హైకోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో రీజినల్ డైరెక్టర్ నాగరాజు సోమవారం సాయంకాలం ఉద్యోగోన్నతి ఉత్తర్వులను రద్దుచేసి బిల్ కలెక్టర్‌గా నరసింహామూర్తిని నియమించాలని కమిషనర్ బాలస్వామిని ఆదేశించారు. ఇదే విషయాన్ని మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ కార్యాలయానికి సమాచారం పంపాలని ఆదేశించారు. ఇష్టారాజ్యంగా ఉద్యోగోన్నతులు కల్పించిన అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నిబంధనావళికి విరుద్ధంగా సీనియార్టీ జాబితాను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ఉద్యోగోన్నతులు ఎలా కల్పించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మున్సిపల్ కార్పొరేషన్‌లో అడ్డగోలు ఉద్యోగోన్నతులు అంశంపై ఈ ఏడాది మే 16వ తేదీన ప్రజాశక్తి జిల్లా పేజీలో కథనం వెలువరించింది. అప్పట్లో ఈ వార్త కార్పొరేషన్‌లో పెద్ద చర్చకు దారి తీసింది.

**కాసుల కక్కుర్తి..!**

కార్పొరేషన్ ఉద్యోగోన్నతుల అంశంలో సీనియార్టీ జాబితాలను పరిగణలోకి తీసుకోకుండా కాసుల కక్కుర్తితో అప్పటి డిప్యూటీ కమిషనర్ కల్పించిన ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల పనితీరుకు మాయని మచ్చగా మారింది. గతంలో సైతం ఇలాంటి అడ్డగోలు ఉద్యోగోన్నతులు కల్పించి సీనియార్టీ జాబితాలో సీనియర్లుగా ఉన్న వారికి తీరని అన్యాయం చేసిన ఘటనలు కార్పొరేషన్‌లో వెలుగు చూశాయి. ఉద్యోగోన్నతికి అన్ని విధాలా అర్హులై ఉన్నా కూడా దానిని పొందలేని వారు ఉన్నారు. దీనిపై వారు ప్రశ్నిస్తే ఉన్నతాధికారులు తమనెక్కడ ఇబ్బందులు పెడతారో అన్న భయంతో చాలా మంది మౌనంగా ఉండిపోయారు. ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన ఇచ్చిన ఆదేశాలతో గతంలో ఉద్యోగోన్నతుల్లో నష్టపోయిన వారందరికీ ధైర్యం వచ్చినట్లు అయ్యింది. అన్యాయం జరిగితే హక్కుల కోసం పోరాడడం మంచిదే అంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగోన్నతుల విషయంలో సీనియార్టీ జాబితాలను పకడ్బందీగా తయారు చేసి, నిబంధనల మేరకు ఈ ప్రక్రియను నిర్వహించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# నేడు పెన్షనర్ల పండుగ

## లలిత కళాపరిషత్‌లో పెన్షనర్స్ డే వేడుకలు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**



పెద్దన్న గౌడ్



జయరామప్ప

ఉద్యోగి సుధీర్ఘకాలంగా ప్రభుత్వ సర్వీసులో ఉన్నప్పుడు ఉద్యోగ బాధ్యతలు, సంసార బాధ్యతలతో తులమునకలై ఉంటారు. దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల పాటు సుధీర్ఘంగా ప్రభుత్వ సేవలు అందించే ఉద్యోగులు ఉద్యోగవిరమణ అనంతరం పెన్షనర్లుగా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. రిటైర్ అయిన తరువాత సమాజంలో గౌరవం, భద్రతతో జీవనం సాగించేందుకు పెన్షన్ ఒక ముఖ్యమైన ఆధారం, ఆసరా. పెన్షన్ ప్రభుత్వం అందించే భరోసా, రాజ్యాంగం కల్పించిన హక్కు. ఈ హక్కును సుప్రీం కోర్టు చారిత్రాత్మకంగా తీర్పు వెలువడిన రోజు డిసెంబర్ 17న పెన్షన్‌దారుల దినోత్సవంగా పాటిస్తారు.

**నేడు పెన్షనర్ల దినోత్సవ వేడుకలు**

**అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న గౌడ్, జయరామప్ప**

అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత కళాపరిషత్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమంలో పెన్షనర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యర్శులు బి.పెద్దన్న గౌడ్, శీలా జయరామప్పలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌లకు టిడిపి కూటమి ప్రభుత్వంలో పెన్షన్లు అందుతున్నాయన్నారు. అయితే ఇంకా పెన్షనర్ల సమస్యలు చాలా వరకు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు రావాల్సిన డిఆర్, 11వ పిఆర్‌సి బకాయిలు విడుదల కావాల్సి ఉందన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందని పరిస్థితి ఉందన్నారు. మూడు మాసాల్లో ఇవ్వాల్సిన బెనిఫిట్స్ సంవత్సరాల తరబడి జాప్యం జరుగుతోందన్నారు. ఈహెచ్‌ఎస్ పథకం వైద్య సేవల పరిమితి రూ.2 లక్షల నుంచి పెంపుదల చేయాల్సి ఉందన్నారు. సకాలంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ అందేలా చూడాలని కోరారు. పెన్షనర్ల బకాయి డిఆర్‌లు తక్షణమే చెల్లించాలన్నారు. పెండింగ్ డిఆర్‌లు రెండు సంవత్సరాల తరువాత చెల్లించేందుకు ప్రభుత్వం జీవో ఇవ్వడం సరికాదన్నారు. పెన్షనర్ల హక్కుల సాధన కోసం కలిసొచ్చే వారితో నిరసనలు చేపట్టి గొంతెత్తుతామన్నారు.

# పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

## జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

**ప్రజాశక్తి-అనంతపురం**

జిల్లాలో పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి అధ్యక్షతన రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు, ట్రేడర్స్, స్టార్టప్ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం నాడు సమావేశం నిర్వహించారు. గత నెలలో కలెక్టర్ నిర్వహించిన ఎఫ్‌పిఒ సమావేశంలో రైతు ఉత్పత్తిదారులు పండించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే విషయమై చర్చించారు. ఎఫ్ గ్రూప్ ప్రతినిధులు వారి ఉత్పత్తులను సమావేశంలో దృష్టికి తెచ్చారు. స్టార్టప్ కంపెనీని సంబంధించి ఆర్గానిక్ ప్రొడక్ట్స్, మిల్లెట్ ఆధారిత ఉత్పత్తుల తయారీకి సంబంధించిన విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారులు, ఎఫ్‌పిఒ ప్రతినిధులు, ట్రేడర్స్, స్టార్టప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

**61,475 హెక్టర్లలో పంట నమోదు**

రబీ 2025-26లో ఇప్పటి వరకు 61,475 హెక్టార్ల పంటలు సాగైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. రబీ 2025-26 పంట నమోదును ఫిబ్రవరి 28 తేది లోపు పూర్తి చేయాల్సి ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

## రవికి జేడీఏగా పూర్తి అదనపు బాధ్యతలు



**ప్రజాశక్తి- అనంతపురం**

అనంతపురం జిల్లా వ్యవసాయ అధికారిగా మీనల రవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా తాడిపత్రి వ్యవసాయ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ మీనల రవికి జిల్లా వ్యవసాయ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు వెలు వడ్డాయి.

## పొలం పిలుస్తోంది

**ప్రజాశక్తి-అనంతపురం**

కందుకూరు, జంగాలపల్లి రైతు సేవా కేంద్రాలు పరిధిలోని రైతు సేవ కేంద్రం పరిధిలో పోలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారి రైతులకు తెలియజేశారు. రైతులకు కావాల్సిన యూరియా, డిఎపిలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. పంటలకు మద్దతు ధర ఇచ్చే అంశంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి, బ్యాల్ల మురళీకృష్ణ రైతు సేవా కేంద్ర సిబ్బంది మల్లికార్జున పాల్గొన్నారు.

## ఇంధన పొదుపు పాటించాలి : విద్యుత్ ఈఈ

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**



ర్యాలీని ప్రారంభిస్తున్న విద్యుత్ ఈఈ

ప్రతి వినియోగ దారుడు ఇంధన పొదుపు పాటించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని విద్యుత్ ఈఈ రాజశేఖర్ పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఈఈతో పాటు ఏడీఈలు చంద్రమోహన్‌రెడ్డి, సోమశేఖర్, ఏఈలు రఘు, జయకృష్ణ, బాలచంద్ర, భరత్, గంగాధర్‌తో పాటు సిబ్బంది పట్టణంలోని విద్యుత్ కార్యాలయం నుంచి టీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహజవనరులను సద్వినియోగం చేసు కొని విద్యుత్ పొదుపు పాటించాలన్నారు. అవసరం మేరకే విద్యుత్‌ను వినియోగించాలన్నారు. సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 184 మంది సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. అందరూ సూర్యఘర్ పథకం ద్వారా రాయితీలు పొంది విద్యుత్ ఆదా పాటించాలన్నారు.

# విద్యుత్ సమస్యలపై సిపిఎం ధర్నా



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-గుంతకల్లు**

పట్టణంలోని సిఐటియు, ద్వారకానగర్ కాలనీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సిఐ టియు పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయా కాలనీల ప్రజలతో కలిసి ఆలూరు రోడ్డులోని విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ అధికారి కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సిఐటియు కాలనీలో విద్యుత్ వైర్లు అతి తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని, దీంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందన్నారు. ద్వారకానగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఏఈ రఘుకి పలుమార్లు అర్జీలు ఇచ్చినా, ధర్నాలు చేసినా ప్రయో జనం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో విద్యుత్ సమ్యస్యలను పరిష్కరించాలని, లేనిచో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఐద్వా నాయకురాలు షకీరా, సరస్వతి, ప్రభావతి, ఆదిలక్ష్మి, సిఐటియు కాలనీ వాసులు ఖాదర్, ఈరన్న, ఓబులేసు, ప్రవీణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవంకపై నిగ్గు తేల్చాల్సిందే

## తాడిపత్రి టిడిపి కౌన్సిలర్లు



కౌన్సిలర్ తో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్ రెడ్డి

**ప్రజాశక్తి-తాడిపత్రి**

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి ప్రాంతంలోని ఎర్రవంక ఆక్రమణ గుర్రైందంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు ఇవ్వడంపై టిడిపి కౌన్సిలర్లు స్పందించారు. ఈ మేరకు మంగళవారం నాడు టిడిపి కౌన్సిలర్లు తాడిపత్రి పట్టణంలోని పెద్దారెడ్డి తండ్రి కేతిరెడ్డి రామిరెడ్డి విగ్రహం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఆక్రమణలు జరిగాయంటూ పెద్దారెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఆక్రమణలు జరిగి ఉంటే తామే చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. వెంటనే ఎర్రవంక ప్రాంతంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి నిజాలు నిగ్గుతేల్చాలన్నారు. తహశీల్దార్ సోమశేఖర్ నిరసన శిబిరం వద్దకు చేరుకుని మాట్లాడారు. నాలుగు రోజుల్లో ఆ ప్రాంతంలో రెవెన్యూ అధికారులతో సర్వే నిర్వహిస్తామన్నారు. దీంతో టిడిపి కౌన్సిలర్లు ఆందోళన విరమించారు.

# యూత్ ఏషియన్ పారా అథ్లెటిక్స్‌లో నరేష్‌కు సిల్వర్ మెడల్

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**



నరేష్‌ను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

దుబాయిలో డిసెంబర్ 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన యూత్ ఏషియన్ పారా అథ్లెటిక్స్‌లో అవిలికొండ నరేష్‌కు (టి44) కేటగిరిలో 400 మీటర్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. మంగళవారం ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు అందరూ అవలికొండ నరేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ గుడుపూడి నారాయణస్వామి హాజరై మాట్లాడుతూ నరేష్ ఘన విజయం సాధించడానికి సహకరించిన పారా స్పోర్ట్స్ అసోసియేషన్‌కు, ఆర్‌డిటికి, కళాశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్ఐఒ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎం.వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నాగరాజు ఎన్.శ్రీనివాసులు, ఎడిఎన్ఈ ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు రమణరెడ్డి, నిర్మలమ్మ, ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎన్.రామ్మోహన్, డాక్టర్ ఎం.శ్రీవాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు పిల్లలపల్లి పిఇటి



జగన్మోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

మండలంలోని పిల్లలపల్లి జడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జగన్మోహన్‌రెడ్డి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కత్తి బసవరాజు, ఉపాధ్యాయుడు అశోక్‌కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీల్లో బాపట్లలో రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అందులో పాల్గొన్న జగన్మోహన్‌రెడ్డి లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్ త్రో, 4-100 మీటర్లు రిలే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం పిఇటి జగన్మోహన్‌రెడ్డిని హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం సన్మానించారు. పిఇటి మాట్లాడుతూ ఆటలంటే మక్కువతోనే తాను నిరంతర ప్రయత్నం చేశానన్నారు. పాఠశాల స్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన

**మడకశిర రూరల్ :** మండల పరిధిలోని కల్లుమర్రి హై స్కూల్ ప్రాంగణంలో హెలిక్యాప్టర్ ల్యాండింగ్ స్థలాన్ని పెనుగొండ డి.ఎస్.పి నర్సింగరావు అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆదేశాలతో జువాలజీ సర్వే కోసం ఆరు నెలలు పాటు నిర్వహించే హెలి సర్వే కోసం హెలికాప్టర్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమానికి కల్లుమర్రి సర్పంచి నాగరాజ్, ఆర్అండ్‌బి డిఇ లక్ష్మీనారాయణ, సిఐ సుబ్రహ్మణ్యం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'పల్స్‌పోలియో'ను జయప్రదం చేద్దాం

డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఈబి.దేవి



పల్స్‌పోలియో' వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్‌ఒ, వైద్యాధికారులు

**ప్రజాశక్తి-అనంతపురం**

వైద్య ఆరోగ్యశాఖ, అనుబంధ శాఖలను సమన్వయం చేసుకొని జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి ఆదేశించారు. నగరంలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో మంగళవారం 'పల్స్‌పోలియో' వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియోపై విజయం సాధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, జిల్లా లెప్రసీ, టిబి, ఎయిడ్స్ అధికారి డాక్టర్ జయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు

**మాతా శిశు మరణాలపై సమీక్ష**

మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా పని చేద్దామని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఈబి.దేవి సూచించారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో మాతా శిశు మరణాలపై సమీక్ష, సమావేశం నిర్వహిం చారు. జిల్లాలో జరిగిన 6 శిశు మరణాలపై సమీక్షించారు. హైరిస్క్ కేసుల విషయంలో క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. గర్భిణి సమయంలో, ప్రసవం అనంతర సేవల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. మాతా శిశు మరణాలు జరగకుండా అప్రమత్తంగా ఉండా లన్నారు. సమావేశంలో డా. డేవిడ్ సెల్వరాజ్, డిసిహెచ్‌ఎస్ డా. శశిభూషణ్‌రెడ్డి, డిఐఒ డా. శ్రీనివాస్ రెడ్డి, డిపిఎంఒ డా. విష్ణుమూర్తి, డా. శ్రీధర్, డా. రేణుక పాల్గొన్నారు.




రాష్ట్రస్థాయి బహుమతులు సాధించిన పిజి విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

## వైద్య కళాశాలకు రాష్ట్రస్థాయి అవార్డులు

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం వైద్య కళాశాలలో పిజి చేస్తున్న డాక్టర్ కె.రాజేంద్రకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి దక్కింది. ఆయన హ్యూమన్ మిల్క్ బ్యాంక్‌పై పరిశోధనలు చేసి విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన కాన్ఫరెన్స్‌లో ప్రజెంటేషన్ ఇచ్చారు. అందుకు ఉత్తమ అవార్డు రావడంపై సామాజిక శాస్త్ర వైద్య విభాగం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. న్యూట్రిషన్ ఎన్‌సిడి క్విజ్ పోటీలోనూ పిజి విద్యార్థులు డాక్టర్. కె.రాజేంద్ర, డాక్టర్. పి.కస్తూరి, డాక్టర్ జి.రొనాల్డో తృతీయ బహుమతి సాధించారు. దీంతో మంగవారం సామాజిక వైద్యశాస్త్ర విభాగం ఆచార్యులు డాక్టర్ పి.మధు, డాక్టర్ వాల్మీకి శ్రీనివాస్ కుమార్, డాక్టర్. ఆదినటేష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పిజి విద్యార్థులు మర్యాదపూర్వకంగా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీని కలిశారు. ప్రిన్సిపల్ వారిని అభినందించి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు తీసుకురావాలని ఆకాంక్షించారు. పిజి విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే వ్యక్తిగంగా రూ. లక్ష ఇస్తానని ఎస్‌పిఎం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాల్మీకి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ తెలుగు మధుసూదన్, పలువురు వైద్యులు, పిజి విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఛైర్‌పర్సన్ గౌతమి, సోమశేఖర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

## మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు సన్మానం

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

మున్సిపల్ నూతన ఛైర్‌పర్సన్ తలారి గౌతమి, సోమశేఖర్‌లను మంగళవారం ఆమె ఛాంబర్‌లో పలువురు నాయకులు సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన టిడిపి నాయ కులు గౌని శ్రీనివాసరెడ్డి, ఊటంకి రామాంజినేయులు, మంజునాథ్‌రెడ్డి, రాజశేఖర్, వెంకటేశులు, ఎర్రి స్వామి, మల్లేష్, మారుతి, వన్నూరుస్వామి, తదితరులు వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషిచేయాలని వారు కోరారు.



సాధించిన మెడల్స్, ప్రశంసాపత్రాలతో 'శ్రీవికాస్' విద్యార్థులు

## జాతీయ స్థాయి పోటీలకు 'శ్రీవికాస్' విద్యార్థులు

### అభినందించిన డిఇఒ ప్రసాద్‌బాబు

**ప్రజాశక్తి-అనంతపురం సిటీ**

నగరంలోని శ్రీవికాస్ పాఠశాల విద్యార్థులు 13 మంది రాష్ట్రస్థాయి వెస్ట్రన్, ఫోక్ డాన్స్ విభా గాల్లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని మంగళవారం డిఇఒ ప్రసాద్‌బాబు అభినందిం చారు. గత ఆదివారం నగరంలోని ఆర్‌డిటి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి వెస్ట్రన్, ఫోక్ డాన్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అందులో శ్రీవికాస్ పాఠశాల విద్యార్థులు వైష్ణవి, జ్ఞాన సంహితరెడ్డి, హిమల్‌సాయి, కుశశ్రీ, సల్మా, అంజుమ్, షణ్ముఖప్రియ, ధనుష, గ్రీష్మ, కార్తీక, అబ్దుల్ రెహ్మాన్, ప్రియాంక, హేమలత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని కరస్పాం డెంట్ జలీల్ అహ్మద్, అపుస్మా రాష్ట్ర నాయకులు పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

**నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాల తనిఖీ**

నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర పాలకోన్నత పాఠశాలను డిఇఒ ప్రసాద్‌బాబు సందర్శించారు. ఆయన పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యాబోధన ఎలా జరుగుతుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని హెచ్‌ఎంను ఆదేశించారు.

## ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాం

**ప్రజాశక్తి-రాయదుర్గం**

స్థానికంగా ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 'ప్రజల వద్దకు ప్రతాప్‌రెడ్డి' కార్యక్రమంలో భాగం గా మంగళవారం ఆయన పట్టణంలోని ఆత్మకూరు వీధిలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆయన మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో దర్గా చుట్టుపక్కల పరిసరాలను శుభ్రం చేయాలని కోరగా శుభ్రం చేయిస్తామని కమిషనర్ తెలిపారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు వసంతకుమార్‌గౌడ్, బాషా, రఫిక్, అయూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న గౌని ప్రతాప్‌రెడ్డి

## తాత్కాలిక ఎంపిపిగా నాగరత్నమ్మ

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

బొమ్మనహాల్ ఎంపిపి యు.పద్మ ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వైస్ ఎంపిపిగా ఉన్న నాగరత్నమ్మను తాత్కాలిక ఎంపిపిగా నియమించినట్లు మంగళ వారం ఎంపిడిఒ విజయభాస్కర్ తెలిపారు. సభ్యులు నూతన ఎంపిపిని ఎన్నుకునే వరకూ నాగరత్నమ్మ తాత్కాలిక ఎంపిపిగా కొనసాగుతారని, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

## పోలీసుల విస్తృత తనిఖీలు



ఎటిఎం కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-అనంతపురం**

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు మంగళవారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీ లు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా రాత్రివేళ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దాబాలు, లాడ్జీలు, తదితర ప్రాంతాల్లో తనిఖీ లు చేశారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, వాటి పరిసర ప్రాంతాల్లో అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఎటిఎం కేంద్రాలు, దేవాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేస్తూ పోలీసు బందోబస్తును మరింత పటిష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ లక్ష్యంగా జిల్లాలోని అన్ని టోల్ గేట్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తూ 'ఫేష్ వాష్ అండ్ గో' కార్యక్రమాలు నిర్వహించారు. అలసటతో డ్రైవింగ్ చేయకుండా కొంత విరామం తీసుకుని ప్రయాణం కొనసాగించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. జిల్లాలో శాంతి భద్రతలు, ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యునిగా గిరి

**ప్రజాశక్తి-శింగనమల**



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యునిగా మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన గిరి ఎన్నికయ్యారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో గిరి రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. గిరి శ్రీకృష్ణదేవరాయ యూని వర్సిటీ కేంద్రంగా విద్యారంగ సమస్యలపై చేసిన అనేక ఉద్యమాల ఫలితంగా కార్యకర్త స్థాయి నుంచి జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. గిరి ఎస్‌కెయులో న్యాయవిద్య చదువుతున్న సమయంలో విసి అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలపై రాజీ లేని పోరాటాలు చేశారు. ఆయన ఉద్యమాలను గుర్తించిన నాయకత్వం జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా అవకాశం కల్పిం చారు. గిరి మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తూ విద్యార్థి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

## అభివృద్ధి పనులపై ఆరా

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

మండలంలోని తలుపూరు గ్రామపంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం అధికారులు పరిశీలించారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు, తదితర సమస్యలపై ఆరా తీశారు. జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలన్నారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షలకు సన్నద్ధతపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మగ్బూల్‌బాషా, వీఆర్వో సుధాకర్‌రెడ్డి, జడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సుదర్శన్ పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల విజేత బ్రహ్మసముద్రం

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

కళ్యాణదుర్గం డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో బ్రహ్మసముద్రం జట్టు విజేతగా నిలిచింది. మండలంలోని ఎర్రగుడి పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఫైనల్స్‌లో బ్రహ్మసముద్రం, కణేకల్లు జట్లు తలపడ్డాయి. అందులో బ్రహ్మసముద్రం మండల జట్టు విజయం సాధించి ఈ నెల 22, 23 తేదీల్లో అనంతపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డిఇఒ పాటిల్ మల్లారెడ్డి, ఎంఇఒలు హరికృష్ణ, వేణుగోపాల్, భవానీశంకర్, కె.గోపాల్‌రెడ్డి విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిడిలు గంగాధర్, శ్రీనివాసరెడ్డి, సిద్దన్న, శివకేశవులు, తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌పై నిరాధార ఆరోపణలు తగదు

**ప్రజాశక్తి-యాడికి**

తహశీల్దార్‌పై నిరాధార ఆరోపణలు చేయడం తగదని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు తెలిపారు. స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పక్క మండలాలకు చెందిన కొందరు దళిత సంఘాల నాయకులు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడంతో పాటు అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. ఏ అంశమైనా పూర్తిగా పరిశీలించి నిజం నిర్ధారించిన తర్వాతే ప్రెస్ మీట్ పెట్టాలన్నారు. ప్రధానంగా తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డిపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మండలంలో దళితులకు నిజంగా అన్యాయం జరిగితే ఎమ్మార్పీఎస్ నాయకులు ముందుండి పోరాడతామని, అవసరమైతే ఉద్యమాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీరాములు, జి.నరసింహులు, లక్ష్మణ్, సూర్యుడు, కుళ్లాయప్ప, వెంకటరాముడు, కంబగిరిస్వామి, హనుమంతు, ఎం.రాముడు, వీరన్న, రాజు, చిన్న రాముడు, టైలర్ పుల్లయ్య పాల్గొన్నారు.



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

## పుట్లూరులో నీటి ఎద్దడి

**ప్రజాశక్తి-పుట్లూరు**

మండల కేంద్రమైన పుట్లూరులో తాగునీటి సమస్య తీవ్రమైంది. చెరువులోకి నీరు చేరిన 4, 5 నెలల పాటు గ్రామంలో నీటికి ఇబ్బందులు ఉండవు. మిగిలిన 7, 8 నెలలు గ్రామస్తులు నీటి కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక గ్రామాల పరిస్థితి ఏంటని పలువురు పేర్కొంటున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి పుట్లూరులో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## శీతాకాలంలో గుండె జబ్బులకు అవకాశమెక్కువ

### కార్డియాలజిస్ట్ డాక్టర్ మూడే సందీప్



**ప్రజాశక్తి-అనంతపురం**

మిగతా సీజన్లలో కంటే శీతాకాలంలో హార్ట్ ఎటాక్ ప్రమాదం కొంచెం ఎక్కువగా ఉంటుందని కిమ్స్ సవీర ఆసుపత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మూడే సందీప్ తెలిపారు. శీతాకాలంలో శరీరంలో సింపథటిక్ యాక్టివిటీ అధికంగా ఉండటం వల్ల రక్తనాళాలు కుచించుకుపోవడం, రక్తపోటు పెరగడం, ఉదయం వేళల్లో శరీరంపై ఒక్కసారిగా ఒత్తిడి పడటం వంటి కారణాలతో ప్రమాదం పెరుగుతుందన్నారు. గుండె జబ్బు ఉన్నవారు వెచ్చటి దుస్తులు వేసుకోవడం, షుగర్, బిపిని అదుపులో ఉంచుకోవాన్నారు. అధికంగా వ్యాయామం చేయకూడదు, మందులు సమయానికి వాడడం చాలా ముఖ్యం. ఛాతిలో నొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, చెమట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లాలి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఉదయం చాలా చలిగా ఉన్నప్పుడు నేరుగా బయటకు వెళ్లకుండా, కొద్ది సేపు ఇంట్లోనే నడక, వ్యాయామం చేసి శరీరాన్ని వార్మ్ చేసి బయటికి వెళ్లాలి. శరీర ఉష్ణోగ్రత స్థిరంగా ఉండేలా చూసు కోవాలి. బిపి, షుగర్ ఉన్నవారు రక్తపోటు, రక్తంలో గ్లూకోజ్‌ను క్రమం తప్పకుండా చెక్ చేసుకోవాలి. అవసరమైతే డాక్టర్ సలహా మేరకు మందుల డోసులను సర్దుబాటు చేసుకోవాలి. ఫిజికల్ యాక్టివిటీ పూర్తిగా ఆపేయకుండా, నడక, లైట్ ఎక్సర్‌సైజ్, యోగా లాంటి సాఫ్ట్ యాక్టివిటీలను రోజూ కొనసాగించడం గుండె ఆరోగ్యానికి మంచిది. సిగరెట్, ఆల్కహాల్ వంటివి రక్తనాళాలపై ఎక్కువ హానికరం చూపుతాయి. వాటిని మానేయడం మరింత అవసరం.

**హార్ట్ ఎటాక్‌ను సూచించే లక్షణాలు**

ఛాతీలో నొప్పి లేదా బరువు, ఎడమ చేతి, దవడ, వెన్నుకు వ్యాపించే నొప్పి, ఊపిరి తీసుకోవడం లో ఇబ్బంది, చల్లటి చెమటలు, తీవ్రమైన అలసట. ఈ లక్షణాలు 10 నుంచి 15 నిమిషాలకు మించి ఉంటే ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆసుపత్రికి వెళ్లాలి.



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్

## సబ్‌జైలును సందర్శించిన జడ్జి

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

పట్టణంలోని సబ్‌జైలును మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. 21 ఏళ్ల లోపు నేరస్తులు ఉన్నారా.. ఉంటే మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్‌కు వివరాలు ఇవ్వాలన్నారు. ఖైదీల బ్యారక్‌లు, టాయిలెట్స్, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. ఎన్ని రోజుల నుంచి జైలులో ఉన్నారని అడిగి తెలుసుకుని భోజన వసతులపై ఆరాతీశారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు లీగలైడ్ కౌన్సిల్ అపాయింట్‌మెంట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిటైనర్ లాయర్లు దాదాఖలందర్, ముత్యాలప్ప, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయజెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## ఘనంగా విజయ దివస్

**ప్రజాశక్తి-శెట్టూరు**

1971 యుద్ధంలో భారత సాయుధ దళాలు సాధించిన చారిత్రాత్మక విజయాన్ని, దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లను ప్రతిఒక్కరూ స్మరించు కోవాలని హెచ్‌ఎం వేణుగోపాల్ సూచించారు. మండలంలోని దొడఘట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సైనిక వందనం చేశారు. ఉపాధ్యాయుడు రాజన్న మాట్లాడుతూ యువత సైన్యంలో చేరి దేశ రక్షణలో భాగస్వాములు కావాలన్నారు. దేశ ఐక్యత, సార్వభౌమత్వం కోసం నిరంతరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజన్న, వెంకటేశులు, రమేష్, మనోహర్, విజయ్ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా రథోత్సవం

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

మండలంలోని విరుపాపల్లి గ్రామంలో వెలసిన సద్గురు నారాయణార్యరూడస్వామి 52వ ఆరాధన ఉత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు చేసి మహా మంగళ హారతి నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పూలతో అలంకరించిన రథంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి రథోత్సవం నిర్వహించారు. రథం ముందు మహిళలు కలశాలతో నడిచారు. ఉరాలు, డ్రమ్స్, మంగళ వాయిద్యాలు, నంది కోలాటలు, చెక్కభజన మధ్య పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మఠం అధ్యక్షులు మారాచి సూర్యనారాయణ స్వామి, రిటైర్డ్ టీచర్ లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

**ప్రజాశక్తి-నార్పల**

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో నార్పల క్రాసింగ్ సమీపంలో పేదల కోసం గుడిసెలు వేశారు. సిపిఐ మండల కార్యదర్శి గంగా ధర్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో కూటమి ప్రభు త్వం కాలయాపన చేస్తుందన్నారు. ఇకనైనా ఎన్నికల హామీ మేరకు పట్టణాల్లో 3, పల్లెల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ, ఎమ్మార్పీఎస్ నాయకులు తహశీల్దార్ ప్రకాష్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి సుధాకర్, లలితమ్మ, పెద్దపెద్దయ్య, సూరి, నారాయణప్ప, నాగరాజు, షెక్షా పాల్గొన్నారు.



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో దుస్తున్న పంపిణీ చేస్తున్న దాతలు

## ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

**ప్రజాశక్తి-అనంతపురం**

పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం నగర సమీపంలోని రాచాను పల్లిలో ఉన్న చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేసి వేడుకలను ప్రారంభించారు. ప్రత్యేక ఆహ్వానితులు సిస్టర్ కీర్తన, సిస్టర్ సంకీర్తన జీసస్ సందేశం వినిపించారు. ముఖ్య ప్రసంగీకులు పాస్టర్ అబ్రహం క్రిస్మస్ కేక్ కట్ చేసి ప్రీ క్రిస్మస్ విశేషాలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథులు పలువురికి ఆర్థికసాయం, దుస్తులు అందజేశా రు. టిడిపి నాయకుడు, సామాజికవేత్త ఎన్.మధు రాయల్ 65 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. చివరగా గౌరవ అతిథులను జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్. పి.మార్క్, సెక్రటరీ పాస్టర్ జీఆర్ ఆనంద్, జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి.మనషే, ట్రెజరర్ పాస్టర్ కె.జీవన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**



ఆత్మహత్యకు పాల్పడిన సాయిసరళ

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రూరల్ పరిధిలోని గన్నేవారిపల్లి కాలనీలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గన్నేవారిపల్లి కాలనీలో లింగం సంజీవరాయుడు, సాయిసరళ(29) దంపతులు నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సాయి సరళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు తాడుతో ఉరి వేసుకొంది. గమనించిన స్థానికులు ఆమెను కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సాయిసరళ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### పేకాట జూదరులు అరెస్ట్

**ప్రజాశక్తి-కుందుర్పి**

పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అరెస్టు చేసి నగదు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ నీలకంఠేశ్వర తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం మండలంలోని ఎర్రగుంట సమీపంలో ఉన్న చింతరపల్లి ఫారెస్ట్‌లో దాడులు చేసి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ. 30,600నగదు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

### టిఫిన్ సెంటర్‌కు నిప్పు.. రూ. 50వేలు నష్టం

**ప్రజాశక్తి-గుత్తి**

గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో టిఫిన్ సెంటర్ కాలిపోయిన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని గాంధీ కూడలి సమీపంలో శ్రీనివాసులు టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. సోమవారం సాయంత్రం యథావిధిగా టిఫిన్ సెంటర్ బంద్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి రెండు ఇడ్లీ బండ్లు, వంట పాత్రలు కాలిపోయాయి. దీంతో సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సమాచారం తెలుసుకున్న వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, నాయకులు అక్కడికి వెళ్లి బాధితున్ని పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. భవిష్య త్తులో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్ రెడ్డి, నాయకులు సివి.రంగారెడ్డి, సి.మల్లయ్య యాదవ్, గురుప్రసాద్ యాదవ్, వై.రామసుబ్బారెడ్డి, డి.షఫీ, సునీల్, కౌన్సిలర్లు వి.వరదరాజులు, వాల్మీకి శివ, తదితరులు పాల్గొన్నారు.



అగ్నికి ఆహుతైన టిఫిన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

## 835 కుక్కలకు కు.ని శస్త్రచికిత్స

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 15వ తేదీ వరకూ 835 కుక్కలకు కుటుంబ నియంత్రణ(కు.ని) శస్త్రచికిత్స చేయించినట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. ఆయన మంగళవారం కంపోస్ట్ యార్డులోని కుక్కల కు.ని శస్త్రచికిత్స అవయవాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మగ, ఆడ కుక్కలకు కు.ని శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఈ రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి-శింగనమల**

మండలంలోని తరిమెల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన ఉబ్బు గంపయ్య పిన్నమ్మ నాగలక్ష్మి మంగళవారం మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే మార్కెట్ యార్డ్ ఛైర్మన్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆ గ్రామం వెళ్లి నాగలక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. మీ కుటుం బానికి టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మహేష్, సంజీవ రాయుడు, డీలర్ చెన్నప్ప, దండు రామదాసు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**టిడిపి నాయకుడి భార్య మృతికి నివాళి**

మండలంలోని రాచేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రవి భార్య ప్రమీల మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు ఆ గ్రామం వెళ్లి ప్రమీల మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయనతో పాటు నాయకులు గుర్రం లక్ష్మీనారా యణ, గుత్తా ఆదినారాయణ, వెంకటేష్, పెద్దన్న, డీలర్ వెంకటనారాయణ, రంగారెడ్డి, విజయ్‌కుమార్, రామకృష్ణ, మల్లికార్జున ఉన్నారు



తరిమెలలో నాగలక్ష్మి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దండు శ్రీనివాసులు